

సెలవుల్లో ఉచిత శిక్షణ 9లో▸
వేసవి సెలవుల్లో చిన్నారులు పలు రంగాల్లో రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇస్తోంది జిల్లాకేంద్రంలోని బాల కేంద్రం. వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీస్తోంది.



హనుమాన్ శోభాయాత్ర
తాంసి మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఊరేగించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
36.0/26.0

వాతావరణం
వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతీవ్రత పెరగనుంది. పలుచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాలల హక్కులు పరిరక్షించాలి



మాట్లాడుతున్న డీసీపీవో రాజేంద్రప్రసాద్

తాంసి: బాలల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒకరిపై ఉందని డీసీపీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని పొన్నారి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల నివారణ అందరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ప్రతీ విద్యార్థి చదువుకునేలా ప్రోత్సాహించాలన్నారు. బాలల పరిరక్షణ కమిటీ విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, ప్రొటెక్షన్ ఆఫీసర్ స్వామి, సర్పంచ్ సంజీవరెడ్డి, వైస్ఎంపీపీ రేఖ రఘు, తదితరులు పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ వేడుకలు



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో శనివారం ఫేర్‌వెల్ వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. సీనియర్లకు జూనియర్లు వీడ్కోలు పలికారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లు ఊడ్చి జేపీఎస్‌ల నిరసన



శ్రమదానంతో నిరసన తెలుపుతున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలనే డిమాండ్‌తో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన సమ్మె తొమ్మిదో రోజుకు చేరింది. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జేపీఎస్‌లు శనివారం కలెక్టరేట్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం ఎదుట శ్రమదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. చీపుర్లు చేతబూని రోడ్లను శుభ్రం చేయడంతో పాటు కలెక్టరేట్ ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించారు. వీరి ఆందోళనకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్ము కృష్ణకుమార్, రవీందర్‌రెడ్డితో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంఘీభావం ప్రకటించారు.

బదిలీ సందేహాలుంటే నివృత్తి చేసుకోండి



'జూమ్'లో మాట్లాడుతున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాల్లో బదిలీలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలని డీఈవో ప్రణీత సూచించారు. ఈమేరకు శనివారం డీఈవో కార్యాలయం నుంచి జూమ్ ద్వారా కేజీబీవీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 9వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 29వ తేదీ వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఉద్యోగుల సందేహాలను విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి ఉదయశ్రీ నివృత్తి చేశారు.

వైద్యఆరోగ్యశాఖ సంచాలకుడిని కలిసిన ఉద్యోగులు

ఎదులాపురం: వైద్య ప్రజారోగ్య కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు శనివారం వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులు శ్రీనివాస్‌రావును హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేసిన నేపథ్యంలో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కలెక్టర్ ద్వారా రెగ్యులర్ ఉత్తర్వులు త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నాయకులు రవీందర్, తదితరులు ఉన్నారు.

నాట్యమయూరాలు



సండే స్పెషల్

- కూచిపూడిలో రాణిస్తున్న పలువురు అక్కాచెల్లెళ్లు
- జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ
- ఇప్పటికే పలు పురస్కారాలు కైవసం

ఇప్పుడిప్పుడే విద్యాబుద్ధులు నేర్చుకుంటున్న ఈ చిన్నారులు నాట్యంలోనూ రాణిస్తున్నారు. లయబద్ధంగా నర్తిస్తూ అందరితో శభాష్ అనిపించుకుంటున్నారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఇప్పటికే పలు పురస్కారాలు సైతం కైవసం చేసుకున్నారు. వయస్సుకు మించిన నైపుణ్యాలు ప్రదర్శిస్తూ జిల్లా కీర్తిని ఇనుమడింపజేస్తున్నారు ఈ నాట్యమయూరాలు. జిల్లాకు చెందిన పలువురు అక్కా చెల్లెళ్లు స్థానిక బాల కేంద్రంలో కూచిపూడిలో శిక్షణ పొందుతున్నారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో రాణిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.
– ఆదిలాబాద్

అబ్బురపరుస్తున్న ఆర్తీ-రాగిణి



నృత్య ప్రదర్శనలో ఆర్తీ-రాగిణి

శిల్ప సదృశ్యమైన భంగిమలతో ముగ్ధ మనోహరంగా నృత్యం ప్రదర్శించడంలో ఈ సోదరీమణులు దిట్ట. జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన షెల్గావే కేశవ్-శివలీల దంపతుల కుమార్తెలైన వీరు ఇప్పటికే 12కు పైగా జాతీయ, రాష్ట్ర, జిల్లాస్థాయి వేదికలపై నర్తించి అలరించారు. లిమ్కా, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో సైతం చోటు దక్కించుకోవడం విశేషం. ప్రస్తుతం నాలుగో తరగతి చదువుతున్న ఆర్తీ ఇటీవల స్వామి వివేకానంద ఫౌండేషన్, కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ కూచిపూడి నృత్య పోటీల్లో తృతీయ స్థానం కైవసం చేసుకుంది. ఆర్తీ ప్రతిభకు నంది పురస్కారం సైతం దక్కింది. ప్రస్తుతం రెండో తరగతిలో ఉన్న రాగిణి మహిషాసుర మర్దిని నృత్యంపై బృంద సభ్యులతో కలిసి పది సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లో ప్రాతినిధ్యం వహించింది.

ఔరా అనిపిస్తున్న హాశ్వితా-సాయి స్ఫుతిక



జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన గుండేటి మనోజ్ కుమార్-హారిక దంపతుల కూతుళ్లు హాశ్వితా, సాయి స్ఫుతిక. వీరికి చిరుప్రాయం నుంచే కూచుపూడిలో శిక్షణ ఇప్పించగా ఇప్పటి వరకు 20 చోట్ల ప్రదర్శనలు ఇచ్చి ఔరా అనిపించుకుంటున్నారు. ప్రస్తుతం హాశ్విత ఐదోతరగతి, సాయి స్ఫుతిక ఒకటో తరగతి చదువుతున్నారు. హాశ్విత నంది పురస్కారంతో పాటు ఇతర పురస్కారాలు సైతం కైవసం చేసుకుంది. మరోవైపు సాయి స్ఫుతిక మ్యూజికల్ కీబోర్డ్ సైతం నేర్చుకుంటూ శాస్త్రీయ కళలను అభ్యసిస్తానని చెబుతోంది.

పాదం కదిపితే పురస్కారాలే..



రాధాకృష్ణుల వేషధారణలో అక్షిత, శ్రీవర్ధిని

వీరు నర్తిస్తే చూపరులు దృష్టి మరల్చుకోరు.. అంతలా ఉంటుంది వీరి నృత్య ప్రదర్శన. ఇప్పటి వరకు 38 జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి వేదికల్లో ప్రదర్శన లిచ్చారు ఈ అక్కాచెల్లెళ్లు. వీరే జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌కు చెందిన తిరుపతి-లిఖిత దంపతుల కుమార్తెలు శ్రీ వర్ధిని, అక్షిత. ప్రస్తుతం శ్రీవర్ధిని ఐదో తరగతి చదువుతుండగా, అక్షిత నాలుగో తరగతి చదువుతోంది. వీరు ఇటీవల మహారాష్ట్రలోని వార్ధాలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో తృతీయ స్థానం సాధించిన బృందంలో సభ్యులుగా ఉన్నారు. శ్రీవర్ధిని నటరాజ పురస్కారాన్ని పొందడం విశేషం. అలాగే పది సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ రికార్డ్ ఈవెంట్‌లోనూ భాగస్వామ్యం అయింది.

కఠోర సాధన చేస్తూ...



గడ్డం శ్రీనిధి, మనుశ్రీ

జిల్లా కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన గడ్డం రవీందర్‌రెడ్డి-రుచిత దంపతుల కుమార్తెలు శ్రీనిధి, మనుశ్రీ కూచిపూడిలో కఠోర సాధన చేస్తూ జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నారు. శ్రీనిధి ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన సంగీత నృత్య సమ్మేళనంలో నృత్య ప్రదర్శన చేసి ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. అలాగే జనవరి 29, 30 తేదీల్లో మహారాష్ట్రలోని వార్ధాలో నిర్వహించిన జాతీయస్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. అలాగే మనుశ్రీ సైతం తన అక్కను అనుకరిస్తూ పలు జిల్లాస్థాయి పోటీల్లో పాలుపంచుకుంది.

శిబిరంలో చేరి శిక్షణతో రాటుదేలి..



నాలం మహాలక్ష్మి, అనన్య

వేసవి శిక్షణ శిబిరంలో చేరి కూచిపూడిలో రాణిస్తూ ఆకట్టుకుంటున్నారు మహాలక్ష్మి, అనన్యలు. జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్ ప్రాంతంలో గల నాలం శ్రీనివాస్-సారిక దంపతుల సంతానమైన వీరు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. ఇటీవల మంచిర్యాలలో నిర్వహించిన సాంస్కృతిక నత్య పోటీల్లో నర్తించి అందరి ప్రశంసలు అందుకుంది. చెల్లెలు అనన్య సైతం అక్క స్ఫూర్తితో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరుస్తోంది.

తడిసిన ధాన్యానికి కూడా 'మద్దతు'

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

కైలాస్‌నగర్: తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, సీఎంఆర్, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పట్టణ ప్రాంతాల్లో డబుల్ బెడ్‌రూం నిర్మాణం, 58, 59 జీవోల క్రమబద్ధీకరణ, ఆయిల్ పామ్ సాగు, ఎరువుల పర్యవేక్షణ వంటి అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడారు. ప్రభుత్వ నిర్దేశిత కార్యక్రమాల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కంటి వెలుగు, ఆరోగ్య మహిళ శిబిరాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తి స్థాయిలో ప్రారంభించి రైతుల వద్ద నుంచి చివరి గింజ వరకు కొనుగోలు చేయాలన్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని సైతం మద్దతు ధరతో కొనుగోలు చేయాలన్నారు. జీఓ 58 కింద పట్టాల పంపిణీ కార్యక్రమం పూర్తి కావాలన్నారు. జీవో 59 కింద దరఖాస్తుదారులు రూ.3 లక్షల లోపు రుసుము చెల్లించాల్సి ఉందని, వచ్చే వారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫస్ట్ ఇనస్టాల్మెంట్ చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీవో 76 కింద పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వచ్చే వారం వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో ఆయా కార్యక్రమాల అమలును కలెక్టర్ సీఎస్‌కు వివరించారు. ఇందులో అదనపు కలెక్టర్లు రిజ్వాన్, నటరాజ్, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీజ, ఆర్డీవోలు రాథోడ్ రమేష్, సురేశ్, డీఎంహెచ్‌వో నరేందర్, మున్సిపల్ కమిషనర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఆగమేఘాలపై 'రెగ్యులర్' ఉత్తర్వులు

- పాత తేదీలో జారీ..!
- గుట్టుగా విధుల్లోకి లెక్చరర్లు
- చర్చనీయాంశంగా 'కాంట్రాక్ట్' క్రమబద్ధీకరణ

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వం ఇటీవల కాంట్రాక్టు జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ లెక్చరర్లను క్రమబద్ధీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే కొంత మంది ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై కోర్టుకు వెళ్లారు. దీంతో కోర్టు స్టే విధించింది. కాగా జిల్లాలో జూనియర్ లెక్చరర్ల క్రమబద్ధీకరణ అంశం చర్చనీయాంశమవుతోంది. ఈ నెల 3న కాంట్రాక్టు లెక్చరర్లను క్రమబద్ధీకరించి ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మరుసటి రోజు విధుల్లోకి చేరినట్లుగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లపై ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడం విమర్శలకు తావిస్తోంది. మెసేంజర్ల ద్వారా ఆర్జేడీ నుంచి డీఐఈవోలకు ఐడీ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాళ్లకు ఈనెల 5న రాత్రి ఈ ఉత్తర్వులు అందాయి. దీంతో వారు వెంటనే సంబంధిత లెక్చరర్లకు సమాచారం అందించి రాత్రి రాత్రే అర్డర్స్ అందజేశారు. విషయం ఎక్కడా పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. కొంత మంది శుక్రవారం, మరికొంత మంది శనివారం సంబంధిత కళాశాలల్లో విధుల్లో చేరారు. అయితే ఆ ఉత్తర్వు కాపీల్లో మాత్రం ఈ నెల 4వ తేదీనే కళాశాలల్లో చేరినట్లు ఉంది. క్రమబద్ధీకరణ విషయం కోర్టు పరిధిలో ఉండడంతో సంబంధిత అధ్యాపకులు నిబంధనలకు విరుద్ధంగా విధుల్లో చేరడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆదిలాబాద్ జిల్లాలో 13 ప్రభుత్వ కళాశాలలు ఉండగా, వీటిలో 124 మంది కాంట్రాక్టు లెక్చరర్లుగా పని చేస్తున్నారు. ఇందులో 111 మందికి మాత్రమే ఉత్తర్వులు అందాయి. వీరిలో 108 మంది జనరల్ కోర్సు బోధించే లెక్చరర్లు ఉండగా, ముగ్గురు ఒకేషనల్ కోర్సు బోధించే వారు ఉన్నారు. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో మూడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఆదిలాబాద్ సైన్స్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు విధుల్లో చేరారు. ఈ విషయమై డీఐఈవో రవీందర్‌ను వివరణ కోరగా.. ఇది వరకే ఉత్తర్వులు వచ్చాయని తెలిపారు. జిల్లాలో 111 మంది లెక్చరర్లు విధుల్లో చేరినట్లు వివరించారు. అలాగే ఆదిలాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏడుగురు, ఉట్నూర్ పాలిటెక్నిక్ కళాశాలలో తొమ్మిది మంది కూడా విధుల్లో చేరినట్లు తెలిసింది.

ప్రభుత్వ తీరు సరికాదు

మూడు లక్షల మంది నిరుద్యోగులను కాదని ఐదు వేల మందికి లబ్ధి చేకూర్చేలా ప్రభుత్వం వ్యవహరించడం ఎంత వరకు సమంజసం. ఈ విషయంపై ప్రభుత్వం పునరాలోచించాలి. కోర్టు ఉత్తర్వులు కాదని ఈ నెల 5న అర్ధరాత్రి ఆర్డర్లు ఇచ్చారు. అయితే 4వ తేదీన విధుల్లో చేరినట్లు చూడాలని ప్రిన్సిపాళ్లపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది. ఇది సరైన పద్ధతి కాదు. బాధ్యత ఉన్న ప్రిన్సిపాళ్లు కాంట్రాక్టు లెక్చరర్లను పాత తేదీల్లో ఏ విధంగా విధుల్లో చేర్చుకుంటారు. నిబంధనలు ఉల్లంఘించిన సంబంధిత డీఐఈవోలు, ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలి. కోర్టు ఉత్తర్వులు బేఖాతరు చేయడం సరికాదు. ఈ విషయంలో న్యాయస్థానం చొరవ తీసుకుని నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరుతున్నాం.
– జుట్టు చంద్రశేఖర్, తెలంగాణ ఎంఈడీ అసోసియేషన్ అధ్యక్షుడు

మెనూ మారేనా..?



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న సెక్టోరియల్ అధికారి (ఫైల్)

- కేజీబీవీల్లో పెరిగిన మెస్‌చార్జీలు
- రూ.1,040 నుంచి రూ.1,225కు పెంపు
- పర్యవేక్షణతోనే నాసిరకం భోజనానికి చెక్

ఆదిలాబాద్‌టౌన్: బాలిక విద్యను ప్రొత్సహించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కస్తూరిబా విద్యాలయాలు ఏర్పాటు చేసింది. వీటిలో ఆరు నుంచి పదో తరగతి వరకు, కొన్నింటిలో ఇంటర్ వరకు విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్కో విద్యార్థినికి ప్రభుత్వం మెస్‌చార్జి కింద నెలకు రూ.1,040 చెల్లిస్తుంది. అయితే ఇవి సరిపోవడం లేదని కేజీబీవీ ప్రత్యేక అధికారులు చెబుతున్నారు. మెనూలో కోత విధిస్తూ కొన్నిచోట్ల నాసిరకం భోజనం వండి పెట్టేవారు. ఈ కారణంగా విద్యార్థినులు పలుమార్లు అనారోగ్యం బారిన పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రభుత్వం మెస్‌చార్జీని రూ.1,225కి పెంచుతూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంతో పోల్చితే రూ.175 పెరగగా.. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇవి అమలు కానున్నాయి. చార్జీల పెంపుపై కేజీబీవీ స్పెషలాఫీసర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాసిరకం భోజనంతో..

ఆదిలాబాద్ జిల్లాలో 17 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో 4500 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇదిలా ఉండగా నాసిరకం భోజనం కారణంగా గతంలో ఆదిలాబాద్ రూరల్ కేజీబీవీలో ఫుడ్ పాయిజన్ జరిగి వంద మందికిపైగా విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. అలాగే ఆదిలాబాద్ పట్టణంలోని డైట్ కళాశాల వసతి గృహంలో కొనసాగుతున్న భీంపూర్ కేజీబీవీలోనూ ఇలాంటి సంఘటనే చోటు చేసుకుంది. విద్యార్థినులకు వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రి పాలయ్యారు. గత డిసెంబర్‌లో ఉట్నూర్ కేజీబీవీలో నాసిరకం భోజనం కారణంగా 60 మంది విద్యార్థినులు ఆస్పత్రి పాలైన విషయం తెలిసిందే. దీంతో అక్కడ పని చేసే ప్రత్యేక అధికారి, సిబ్బందిపై వేటు పడింది. అయితే మెస్ చార్జీలు సరిపోవడం లేదని ఇది వరకు ప్రత్యేక అధికారులు మెనూ కోత విధించారు. పెరిగిన చార్జీలతోనైనా నాణ్యమైన భోజనం పెట్టాలని విద్యార్థినుల తల్లిదండ్రులు కోరుతున్నారు. అయితే గతంలో ఉన్న మెనూనే ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. మెస్ చార్జీలు సరిపోవడం లేదని, మటన్, నెయ్యి, పూరీలు, స్వీట్లు, పండ్లు అందించడంలో కోత విధించారు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలిసినా వారు చూసీ చూడనట్లుగా వదిలేశారు. ఇకనైనా కేజీబీవీల పర్యవేక్షణపై దృష్టిసారించాలని పులువురు కోరుతున్నారు.

మెనూ ఇది..

విద్యార్థినులకు ఉదయం అందించే మెనూలో వారంలో నాలుగు రోజులు రాగి మాల్ట్, మూడు రోజులు బూస్ట్ ఇవ్వాల్సి ఉంది. అలాగే టిఫిన్ వారానికి రెండు రోజులు ఇడ్లీ, రెండు రోజులు ఉప్మా, ఒకరోజు పూరి, ఒకరోజు చపాతి, మరోరోజు స్పెషల్ ఐటమ్ పెట్టాలి. మధ్యాహ్నం భోజనంలో ప్రతిరోజు పప్పు, అన్నం, ఆకుకూరలు, కూరగాయలతో భోజనం అందించాలి. పెరుగు, నెయ్యి, సాంబరు, పప్పుచారు ఇవ్వాల్సి ఉంది. రెండు, నాలుగో బుధవారం చికెన్, అలాగే నెలకు రెండుసార్లు మటన్‌తో భోజనం పెట్టాలి. వారానికి నాలుగు సార్లు ఉడికించిన కోడి గుడ్లు ఇవ్వాలి. సాయంత్రం స్నాక్స్ రూపంలో పల్లిపట్టీ, బిస్కెట్లు, మిల్లెట్స్, నానబెట్టిన శనగలు, పెసళ్లు, తదితరవి ఇవ్వాలి. శనివారం గులాబ్‌జాం, ఇతర స్వీట్లు, సేమియా అందించాల్సి ఉంది. అయితే ఇది వరకు వీటిలో చాలా వరకు మెనూలో కోత విధించారు. చార్జీలు పెరిగిన నేపథ్యంలోనైనా పూర్తిస్థాయిలో అమలు చేస్తారో లేదో చూడాల్సిందే.

నాణ్యమైన భోజనం అందిస్తాం

కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు చేపడతాం. మెస్‌చార్జిని ప్రభుత్వం రూ.1,040 నుంచి రూ.1,225కు పెంచింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇవి అమల్లోకి వస్తాయి. మెనూ ప్రకారం భోజనం పెట్టని ప్రత్యేక అధికారులపై చర్యలు తీసుకుంటాం.
– ప్రణీత, డీఈవో

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- అదనపు కలెక్టర్ రిజ్వాన్

ఆదిలాబాద్: చిన్నతనం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ శాఖల వసతి గృహాల విద్యార్థులకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన ఆర్చరీ, హాకీ శిబిరాలను ప్రారంభించి మాట్లాడారు. నిరంతర సాధనతోనే నైపుణ్యాలు మెరుగుపడతాయన్నారు. ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ గిరి విద్యార్థులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



హాకీ క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రిజ్వాన్, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్

నేడు నీట్

- జిల్లా కేంద్రంలో మూడు పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 1,467 మంది విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ఎంబీబీఎస్ కోర్సులో ప్రవేశం కోసం నిర్వహించే నీట్ రాత పరీక్షకు సర్వం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలో ఇంటర్నేషనల్ ఆర్యభట్ట స్కూల్, చావరా ఉన్నత పాఠశాల, భీంసరి సమీపంలోని ఆర్యభట్ట హైస్కూల్‌లో మూడు కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 1,467 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం ఐదు గంటల 20 నిమిషాల వరకు కొనసాగనుంది. బయోమెట్రిక్ హాజరు దృష్ట్యా విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి ఉదయం 11 నుంచే అనుమతిస్తారు. మధ్యాహ్నం 1.30గంటల తర్వాత గేట్లు మూసివేస్తారని పరీక్ష కోఆర్డినేటర్ శశీర్ తెలిపారు. పరీక్ష నిర్వహణ కోసం ముగ్గురు చొప్పున చీఫ్ సూపరింటెండెంట్లు, డిప్యూటీ చీఫ్ సూపరింటెండెంట్లు, అబ్జర్వర్లు, అలాగే 120మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లుగా పేర్కొన్నారు. ఆయా కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తుతో పాటు 144 సెక్షన్ అమలులో ఉంటుందని వెల్లడించారు. విద్యార్థులు అడ్మిట్ కార్డు, ఫొటోతో హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా

10న వాలీబాల్ జట్ల ఎంపిక

మంచిర్యాలటౌన్: ఈ నెల 10వ తేదీన వరంగల్ జిల్లాలో రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు ఉంటాయని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్ల శంకర్, మైలారం శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 16 ఏళ్ల బాలబాలికలు సంబంధిత వయస్సు ధృవీకరణ పత్రాలు, 5 పాస్ ఫొటోలు వెంట తీసుకెళ్లాలని, ఇతర వివరాలకు 9951246104, 9676590211 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ముఖరా(కె)ను సందర్శించిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులు



మీనాక్షితో మాట్లాడుతున్న సిబ్బంది

ఇచ్చోడ: మండలంలోని ముఖరా(కె) పంచాయతీని శనివారం ఉట్నూర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ రాథోడ్ రామకృష్ణ సందర్శించి గ్రామంలో ప్రతివాడను పరిశీలించారు. గ్రామంలో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, ఇంటింకి ఇకుండుగుంతలు, ఊరంతా పరిశుభ్రంగా ఉండడంతో వారు సర్పంచ్ గాడ్గే మీనాక్షిని అభినందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ముఖరా కె పంచాయతీ రాష్ట్రంలోనే ఆదర్శవంతంగా నిలుస్తోందన్నారు. రానున్న రోజుల్లో హెడ్‌డీఎఫ్‌సీ బ్యాంకు తరఫున ముఖరా కె పంచాయతీకి తమవంతు సహకారం అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, ముఖరా(బి) ఎంపీటీసీ గాడ్గే సూభాష్, నాయకులు ఖరే సంజీవ్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతా



సీతక్కతో ఫోన్‌లో మాట్లాడుతున్న వీవోఏ లావణ్య

ఖానాపూర్: వీవోఏలు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తుతానని ములుగు ఎమ్మెల్యే సీతక్క అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరవధిక రిలే నిరాహార దీక్షలు చేపట్టిన వీవోఏలకు ఫోన్ చేసి మాట్లాడారు. వీవోఏల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీవోఏల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో వీవోఏలు లావణ్య, గంగాధర్, రవీందర్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మల్లారెడ్డి



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం ఇస్తున్న మల్లారెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది, సీనియర్ రాజకీయ నాయకుడు అల్లూరి మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం కోసం తన వంతు కృషి చేస్తానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

- నిరాదరణకు గురవుతున్న వయోవృద్ధులు
- అధికారులను ఆశ్రయిస్తున్న వైనం
- ఇకపై ఫిర్యాదులకు వెబ్‌సైట్



కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన భాగాపూర్ వృద్ధ దంపతులు(ఫైల్)

అమ్మానాన్న భారమా..?!

వృద్ధాప్యం శాపంగా మారుతోంది. కనిపెంచిన తల్లిదండ్రులను అవసాన దశలో ఆదరించలేమంటూ సంతానం చేతులెత్తేస్తుడడం కలవరపెడుతోంది. ఆస్తులు పంచుకుని ఆప్యాయతను పంచలేమంటూ పిల్లలు ఎవరిదారి వారు చూసుకోవడంతో ఒంటరిగా జీవనం గడపాల్సి వస్తోంది. మరికొందరు పిల్లలు తల్లిదండ్రులను వంతులవారీగా చేరదీస్తుండడం వారిని మానసిక వేదనకు గురి చేస్తోంది. పిల్లల కోసం తమ జీవితాన్ని.. సర్వస్వాన్ని ధారబోసిన తల్లిదండ్రులకు జీవిత చరమాంకంలో ఆదరణ కరువవుతోంది. ఇటీవల సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామానికి చెందిన మెడబోయిన వెంకటయ్య(90) నలుగురు కుమారుల వద్ద వంతులవారీగా పోషణపై కలత చెంది ఆత్మహత్య చేసుకోవడం రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనూ నిరాదరణకు గురవుతున్న వృద్ధులు అధికారులు, పోలీసులను ఆశ్రయించడం కనిపిస్తోంది.

– సాక్షి, మంచిర్యాలడెస్క్

ఉమ్మడి జిల్లాలో కొన్ని ఘటనలు

- వృద్ధాప్యంలో ఉన్న తన పోషణ బాధ్యత చూడకుండా కొడుకు ఇంటి నుంచి వెళ్లగొట్టాడని, పోషణ కోసం కొంత సొమ్ము ఇప్పించాలని మంచిర్యాల జిల్లా తీగలపాడ్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి పూదరి చంద్రయ్య మార్చి 14న కలెక్టర్ సంతోష్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.
- మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం ద్వారక గ్రామానికి చెందిన సూరినేని రాజయ్య(80)కు పిల్లలు లేరు. తన అన్న కొడుకు చిరంజీవి వద్ద కరీంనగర్‌లో కొన్ని రోజులు ఉన్నాడు. తన వద్ద ఉన్న రూ.3లక్షలు, రెండు తులాల బంగారం తీసుకుని ఇవ్వడం లేదని, అతడిపై చర్యలు తీసుకుని డబ్బులు, బంగారం ఇప్పించాలని గత నెల 18న ప్రజావాణిలో కలెక్టర్ సంతోష్‌ను ఆశ్రయించాడు.
- నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం భాగాపూర్ గ్రామానికి చెందిన వృద్ధ దంపతులకు ముగ్గురు కుమారులు ఉన్నారు. వారందరికీ పెళ్లిళ్లు చేసి ఓ ఇంటి వారిని చేశారు. ఆస్తిని పంచుకున్న పిల్లల్లో ఇద్దరు తల్లిదండ్రుల ఆలనాపాలనా తమ బాధ్యత కాదన్నారు. దీంతో చిన్న కుమారుడి సహాయంతో మిగతా ఇద్దరు కుమారులపై నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయొచ్చు..

వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటనెన్స్ కేసెస్ అండ్ మానిటరింగ్ సిస్టమ్(టీఎస్‌సీఎంఎంఎస్)ను ఆర్డీవోల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. వేధింపులు, అఘాయిత్యాలపై వయోవృద్ధులు ఫిర్యాదు చేసిన వెంటనే సత్వర న్యాయం చేయడానికి ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. తమ ఫిర్యాదులపై చర్యలు ఏ స్థాయిలో తీసుకుంటున్నారో ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంది. ఫిర్యాదులపై జిల్లా సంక్షేమ అధికారి, జిల్లాలోని రెవెన్యూ అధికారులు, కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తారు.

కొందరికి 'ఆసరా'

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వృద్ధులకు ఆసరా పింఛన్ కొంతవరకు భరోసానిస్తోంది. నెలనెలా అందే పింఛన్ డబ్బులను అవసరమైన మందులు, అనారోగ్య సమస్యలు, నిత్యావసర వస్తువుల కొనుగోలుకు వెచ్చిస్తున్నారు. పింఛన్ అందుతుండడంతో పిల్లల నుంచి కొంతవరకు గౌరవం లభిస్తుందనే అభిప్రాయాన్ని వృద్ధులు వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1,36,757మంది రూ.2,016 చొప్పున పింఛన్ అందుకుంటున్నారు.

జిల్లాల్లో ఆసరా పింఛన్లు పొందుతున్న వృద్ధుల సంఖ్య	
ఆదిలాబాద్	31,404
మంచిర్యాల	40,921
నిర్మల్	39,462
కుమురంభీం	24,970

అనాథాశ్రమాలు.. ఆలయాలే దిక్కా..?



కారణాలు ఏవైనప్పటికీ పిల్లల ఆదరణ లేని తల్లిదండ్రులు కొందరికి అనాథ ఆశ్రమాలు, ఆలయాలే దిక్కవుతున్నాయి. అనాథ వృద్ధాశ్రమాల్లో కొందరు ఆశ్రయం పొందుతుండగా మరికొందరు ఆలయాల వద్ద భిక్షాటన చేస్తున్నారు.

- మహారాష్ట్రలోని బోకర్ గ్రామానికి చెందిన గంగుబాయికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భర్త చనిపోయి ఐదేళ్లు అవుతోంది. కుమారులు ఆలనాపాలన చూడకపోవడంతో నాలుగేళ్లుగా నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ పొట్టపోసుకుంటోంది.
- కామారెడ్డి పట్టణానికి చెందిన వడ్డెర భూమవ్వకు ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మూడేళ్ల క్రితం భర్త చనిపోవడంతో కొడుకు వద్ద ఏడాదిపాటు ఉంది. గత సంవత్సరం కొడుకు అనారోగ్యంతో చనిపోవడంతో కూతుళ్ల వద్ద ఉండలేక నిర్మల్ జిల్లా బాసర ఆలయ ప్రాంగణంలో భిక్షాటన చేస్తూ జీవనం కొనసాగిస్తోంది.

ఇదీ వెబ్‌సైట్ :
https:// tsseniorcitizens. cgg. govt. in
ఎల్డర్‌లైన్ నంబరు :
14567

భయపడాల్సిన అవసరం లేదు



వయో వృద్ధుల మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్ అండ్ సీనియర్ సిటిజన్ యాక్ట్ 2007 ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం తల్లిదండ్రుల సంక్షేమం కొడుకులు గానీ వారి ఆస్తికి ఎవరైతే వారసులవుతారో వారే చూసుకోవాలి. ఒకవేళ ఆస్తి తీసుకున్న తర్వాత పట్టించుకోకపోతే ఆర్డీవో ట్రిబ్యునల్‌లో కేసు వేసుకునే అవకాశం ఉంది. సీఆర్‌పీసీ 125 సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి మనోవర్తి పొందవచ్చు. న్యాయస్థానం తీర్పును నిరాకరించినట్లయితే ఆరు నెలల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తుంది. – శిల్పాశర్మ, న్యాయవాది, నోటరీ, మంచిర్యాల

వృద్ధులకు అండగా ఉంటున్నాం



మంచిర్యాల జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి వృద్ధులు, నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు అండగా నిలుస్తున్నాం. తల్లిదండ్రుల నుంచి ఆస్తులను తీసుకుని, వారిని చూసుకోవడంలో ఇబ్బంది పెడుతున్న వారిలో ఇప్పటికీ తొమ్మిది మందికి చట్టప్రకారంగా న్యాయం జరిగేలా చేశాం. ఆర్డీవోకు ఫిర్యాదు చేయడం వల్ల వృద్ధుల సంక్షేమ చట్టం ప్రకారం వారికి సరైన న్యాయం జరుగుతుంది. తల్లిదండ్రులు, పిల్లలతో అసోసియేషన్ సమక్షంలోనే మాట్లాడి సమస్య పరిష్కరిస్తున్నాం. పరిష్కారం కాకుంటే, ఆర్డీవోకు ఫిర్యాదు చేసి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూస్తాం.
– బొలిశెట్టి రాజలింగు, మంచిర్యాల సీనియర్ సిటిజన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

పెర్సాపేన్‌కు పూజలు



చిత్తగూడలో పూజలు చేస్తున్న తొడసం వంశస్తులు



బాబేఝరిలో పూజల్లో భక్తులు

నార్నూర్: వైశాఖమాసాన్ని పురస్కరించుకుని ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వంశాల వారీగా పెర్సాపేన్ (పెద్దదేవుడు), గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా శనివారం మండలంలోని బాబేఝరి, చిత్తగూడ గ్రామంలో తొడసం వంశస్తులు పెర్సాపేన్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పాడి పంటలు బాగుండాలని, గ్రామంలో అందరు ఆయురోగ్యాలతో ఉండాలని మొక్కుకున్నారు. ప్రతీ ఏడాది ప్రత్యేక పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తొడసం నాగోరావు తెలిపారు. ఇందులో కటోడా తొడసం బాపురావు, గ్రామ పటేల్ తెలంగాణరావు, పాండు, కటోడా ఆనందరావు ఉన్నారు.

అమ్మవారి సన్నిధిలో హైకోర్టు జడ్జి





భైంసా: బాసర శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జువ్వాది శ్రీదేవి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాలల పరిరక్షణ కమిటీలు బలోపేతం



రాచాపూర్‌లో మాట్లాడుతున్న దేవి మురళి

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో బాలల పరిరక్షణ కమిటీలను బలోపేతం చేస్తున్నామని డీసీపీవో దేవి మురళి అన్నారు. శనివారం మండలంలోని రాచాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామంలో బాలల హక్కుల పరిరక్షణ కోసం ఇది వరకే కమిటీలను వేసి వాటిని బలోపేతం చేశామన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో బాలలకు ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే 1098కు ఫోన్ చేయాలన్నారు. గ్రామాల్లో బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఇందులో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యవతి ,సర్పంచ్ బొర్రవ్వ, ఉపసర్పంచ్ ముత్యం, అంగన్‌వాడీ టీచర్ వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



అల్లికలను పరిశీలిస్తున్న జీసీడీవో ఛాయ

ఆదిలాబాద్‌రూరల్: గిరిజన సంక్షేమ శాఖ ఐటీడీఏ ద్వారా విద్యార్థులకు అందజేస్తున్న సమ్మర్ సమ్మిట్ శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జీసీడీవో ఛాయ అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణను ఆమె శనివారం పరిశీలించారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని ఆశ్రమ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థినిలకు 15 రోజుల పాటు సమ్మర్ సమ్మిట్ శిక్షణను అందజేస్తున్నామన్నారు. ఈ శిక్షణలో కుట్లు, అల్లికలు, మెహింది డిజైనింగ్ ఆర్ట్స్, కల్చరల్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్, తదితర రంగాల్లో శిక్షణను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ శిబిరం ఇన్‌చార్జి లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దుర్గనగర్‌కు చెందిన రోహిత్ (21) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... ఈ నెల 4న దుర్గనగర్ కాలనీలో ఓ పెళ్లికి వెళ్లిన రోహిత్ మద్యం సేవించాడు. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం దుర్గనగర్ శివారు ప్రాంతంలో ఉరేసుకుని కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ద్విచక్రవాహనం దొంగ అరెస్ట్

సారంగపూర్: చోరీకి గురైన బైక్ శనివారం వాహనాల తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మార్చి 25వ తేదీ రాత్రి దినేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ఎదుట పార్క్ చేశాడు. మరుసటిరోజు ఉదయం ద్విచక్ర వాహనం కనిపించకపోయే సరికి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శనివారం చించోలి(బి) ఎక్స్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా నిజామాబాద్ జిల్లాకు చెందిన దేగావత్ వెంకట్రావు అనే వ్యక్తి సదరు బైక్‌పై వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆదివాసీ హక్కులను హరిస్తున్న కేంద్రం

- ఆదివాసీ భారత మహాసభ ఆల్ ఇండియా కోఆర్డినేటర్ సౌరవ్‌యాదవ్



అమరవీరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న ఆదివాసీ మహాసభ నాయకులు

ఇంద్రవెల్లి: దేశంలో మాయమాటలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశంలోని ఆదివాసీల హక్కులతో పాటు అధికారాలను హరిస్తోందిన ఆదివాసీ భారత్ మహాసభ ఆల్ ఇండియా కోఆర్డినేటర్ సౌరవ్ యాదవ్ అన్నారు. శనివారం మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి ఈ నెల 7, 8న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రెవెన్యూ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆదివాసీ భారత్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. దేశంలోని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కర్నాటక, ఒరిస్సా, .జార్ఖండ్, మణిపూర్ రాష్ట్రాలతో పాటు ఆయా ప్రాంతాల్లోని ఆదివాసీలకు కల్పించాల్సిన హక్కులు కల్పించకుండా ఆదివాసీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడులు చేయిస్తుందన్నారు. ప్రస్తుతం మణిపూర్‌లో కర్ఫ్యూ విధించి ఆదివాసీలను భయాందోళనకు గురిచేస్తుందని మండిపడ్డారు. కులాల పేరిటి బీజేపీ ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందన్నారు. ఆదివాసీలకు అన్ని హక్కుల కల్పించకపోవడంతో పాటు గోండ్... లంబాడీల మధ్య గొడవలు, కులమత విభేదాలు తీసుకువచ్చేది ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ అని విమర్శించారు. ఆదివాసీలను అడవుల నుంచి ఖాళీ చేయించడానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని తెలిపారు. అడవుల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ పూర్తి హక్కులు ఆదివాసీలకు కల్పించాలన్నారు. మహాసభకు భారీ సంఖ్యలో ఆదివాసీలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆదివాసీ భారత్ మహాసభ నాయకులు యువరాజ్, నైతం రాజు, పరమేశ్వర్, భీంసెన్, రోహిత్, రాజన్న ఉన్నారు.

దొంగల హల్‌చల్

- పంటచేల నుంచి సోలార్ బ్యాటరీలు చోరీ
- బండల్‌నాగాపూర్ ఆలయంలోనూ..



జామిడిలో ధ్వంసం చేసిన సోలార్ బాక్స్

తాంసి: మండలంలోని జామిడి, బండల్‌నాగాపూర్ గ్రామాల్లో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. జామిడి గ్రామంలో పంటచేలలో అడవిపందుల బారి నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు ఏర్పాటు చేసుకున్న సోలార్ బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన రైతులు హరీష్‌రెడ్డి, రాకేష్‌రెడ్డిల పంటచేలలో బ్యాటరీల కోసం ఏర్పాటు చేసిన డబ్బాలను ధ్వంసం చేసి సోలార్ బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. బండల్‌నాగాపూర్ గ్రామానికి సమీపంలోని బ్రహ్మంగారి ఆలయంలో సైతం దుండగులు చోరీకి పాల్పడి ఆలయంలోని హుండిని ధ్వంసం చేసి నగదుతో పాటు వెండి హారతిపళ్లెం, కిరీటం ఎత్తుకెళ్లారు. ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు చేసుకుని వివరాలు సేకరించారు. రూ.50వేల వరకు చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.

వర్షం ఆగినా.. పంట చేతికందదు..



జొన్నకంకులను చూపుతున్న రైతు శివకుమార్





మొలకెత్తిన మొక్కజొన్న పంట చూపుతున్న రైతు ఆనంద్

ఇటీవల కురిసిన అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేశాయి. యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న, జొన్న, వరి, వేరుశనగ వంటి పంటలు పూర్తిగా వర్షార్పణమయ్యాయి. తాంసి మండలం పొన్నారి గ్రామానికి చెందిన అందే ఆనంద్, కుమ్మరి శివకుమార్ తమకున్న ఐదెకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలను సాగు చేశారు. మొక్కజొన్న పంటను తీసి కుప్పలుగా పోయగా వర్షాలకు మొలకెత్తాయి. జొన్న పంట నేలవాలడంతో పాటు వర్షాలకు రంగు మారి ఏ మాత్రం చేతికి రాని పరిస్థితి నెలకొంది. - సాక్షి, ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్